# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 29, ఏప్రిల్, 2015

హైదరాబాద్‌లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో రెండు లక్షల మంది నిరుపేదలకు ఇండ్లు లేవని తేలిందని, వారందరికి ప్రభుత్వం తరపునే ఇండ్లు కట్టించి ఇస్తామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. ఒక్క నిరుపేద కూడా ఇల్లు లేకుండా లేని నగరంగా హైదరాబాద్‌ను మార్చాలన్నది ప్రభుత్వ లక్ష్యమని సిఎం అన్నారు. హైదరాబాద్ నగరంలో పేదల గృహ నిర్మాణంపై ముఖ్యమంత్రి దాదాపు నాలుగు గంటల పాటు క్యాంపు కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌శర్మ, రెవిన్యు శాఖ కార్యదర్శి మీనా, జిహెచ్‌ఎంసి కమీషనర్ సోమేష్‌కుమార్, సిఎంఒ ముఖ్యకార్యదర్శి నర్సింగ్ రావు, హైదరాబాద్ సిటి చీఫ్ ప్లానర్ దేవేందర్‌రెడ్డి, పార్లమెంటరీ కార్యదర్శి జలగం వెంకట్రావ్, హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్లు మహేందర్‌రెడ్డి, సివి.ఆనంద్ తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

ధనవంతుల విలాసాలు, వినోదాలు, కాలక్షేపాలు, అలవాట్ల కోసం వేలాది ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించినప్పుడు నిలువ నీడలేని నిరుపేదలకు ఇండ్లు కట్టించడానికి విలువైన స్థలాలను వినియోగిస్తే తప్పేమిటని ముఖ్యమంత్రి అన్నారు. అధికారులు ఈ దిశగా ఆలోచించి పేదల ఇంటి నిర్మాణ కోసం స్థలాలు సేకరించాలన్నారు. నగరంలో ప్రభుత్వ కార్యాలయాలకు పదుల ఎకరాలు, చిన్నపాటి విద్యాసంస్థలకు వందల ఎకరాలు, యూనివర్సిటీలకు వేల ఎకరాలు, వివిధ క్లబ్బులకు పెద్ద మొత్తంలో భూములు కేటాయించారని చెప్పారు. వాటిలో చాలా భాగం నిరుపయోగంగానే ఉన్నాయని, వాటిని పేదల ఇంటి నిర్మాణ కోసం ఉపయోగించాలని ముఖ్యమంత్రి అన్నారు. కార్పోరేట్ సంస్థలు, పరిశ్రమలకు భూములు కేటాయించినప్పుడు నిరుపేదలకు కూడా ప్రభుత్వ భూములు కేటయించాలన్నారు. హైదరాబాద్ నగరంలో దాదాపు రెండు లక్షల మంది నిరుపేదలకు ఇండ్లు లేవని, వీరికి రెండు వేల ఎకరాల్లో పూర్తిగా ప్రభుత్వ ఖర్చుతో బహుళ అంతస్తుల భవనాల్లో డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టించి ఇస్తామన్నారు. నిరుపేదల ఇండ్లంటే ఎక్కడో విసిరేసినట్లు దూరంగా

ఉండకూడదని, నగరం మధ్యలోనే ఉండాలని, వీలైతే బంజారా హిల్స్, జూబ్లిహిల్స్‌లోనే పేదలకు ఇండ్లు కట్టాలన్నారు. లక్ష 15 వేల కోట్ల రూపాయల బడ్జెట్ ప్రవేశ పెట్టుకున్న తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదల ఇండ్ల నిర్మాణ కోసం నిధుల కొరత అనే సమస్యే ఉండవద్దన్నారు. భూమి లేని, బువ్వ లేని, ఇల్లు లేని నిరుపేదలున్నారని, వారి గురించి ఆలోచించే సామాజిక బాధ్యత ప్రభుత్వానిదేనని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలు ఉండకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని, మొదటి దశలో హైదరాబాద్ నగరంలో నిరుపేదలందరికి ఇండ్లు కట్టిస్తామన్నారు. ఇల్లు లేకపోవడం పెద్ద శాపమని, ఆ బాధ ఇల్లు లేనివారికే తెలుస్తుందని, ఆ కష్టాల నుండి పేదలను గట్టెక్కించడం ప్రభుత్వం బాధ్యత అని సిఎం అన్నారు. ప్రతి ఇంటికి నల్లా ద్వారా మంచినీరు అందిస్తామని ప్రతిజ్ఞ తీసుకున్నట్లే, ప్రతి నిరుపేదకు సొంత ఇల్లు కట్టించాలనే ఆశయంతో ప్రభుత్వం ఉన్నదన్నారు. అయితే ఈ బృహత్తర కార్యక్రమం ఒక్క రోజులో పూర్తి కాకపోయినప్పటికి దశల వారిగా ఇండ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. ఎవరో ఒకరు, ఎక్కడో అక్కడ మొదటి అడుగు వేయాలని, ఆ పని తమ ప్రభుత్వమే చేస్తుందని సిఎం చెప్పారు. హైదరాబాద్ నగరంలో పేదల ఇండ్ల నిర్మాణానికి అవసరమయ్యే 2,000 ఎకరాల భూమిని సేకరించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ గృహనిర్మాణ పథకంలో అక్రమార్కులు చొరబడకుండా చూడాలని సిఎం చెప్పారు. రెవిన్యు శాఖ, ఇంటలిజెన్స్ సహకారంతో అసలైన లబ్దిదారులను ఎంపిక చేయాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. భూసేకరణ జరిపిన తరువాత ఆ భూమిని స్వాధీనం చేసుకుని రెండు లక్షల ఇండ్ల నిర్మాణం చేపట్టే బాధ్యత తీసుకోవాలని జిహెచ్ఎంసి కమిషనర్ సోమేష్ కుమార్‌ను సిఎం ఆదేశించారు.

---

సిపిఆర్ఒ టు సిఎం